గుడివాడలో సుపరిపాలనలో తొలిఅడుగు

విశాలాంధ్ర - భోగాపురం: ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో భాగంగా మండలం గుడివాడ గ్రామంలో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు పర్యటించారు. ఈ ప్రజా చైతన్య కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వ లక్ష్యాలను, ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సామర్థ్యవంతమైన పాలన విధానాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. సుపరిపాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిల్ల జమున, టిడిపి నాయకులు చిల్ల సురేష్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ దాసరి అప్పలస్వామి, యూనిట్ ఇంఛార్జి కొండవు ఈశ్వరరావు, గ్రామ టీడీపీ అధ్యక్షులు చిల్ల పరుశురాం, వైస్ సర్పంచ్ దాసరి బుజ్జి గ్రామంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

విజయనగరం

పేజ నెం. 8

ఆదివారం 13, జూలై 2025

ఎన్‌వోసీ లేకుండా టాక్స్ ఎలా వేస్తాం

జాగరం వాటర్ ప్లాంట్ అనుమతులపై పంచాయతీ ఆలోచన
అధికారులను పట్టించుకోని ప్లాంట్ యాజమాన్యం

విశాలాంధ్ర - జామి: మండలంలోని జాగరంలో సర్వే నెం.248, 249లలో రెండేళ్ళ క్రితం నిర్మించిన బేవ్యూ బెవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో వాటర్ కంపెనీ ఏర్పాటు చేశారు. రెండేళ్ళుగా ఎటువంటి అభ్యంతరాలు లేకుండా ఇక్కడ నుంచి లక్షలాది లీటర్లు నీటిని యథేచ్ఛగా వాటర్ బాటిల్స్ ద్వారా తరలిస్తూనే వున్నారు. కోట్ల రూపాయల టర్నోవర్ కలిగిన ఈ ప్లాంట్‌కు ఎటువంటి పంచాయతీ అనుమతులు లేకపోవడం విశేషమైతే, తెలిసిన తరువాత కూడా అధికారులు పట్టించుకోకపోవడం మరో విశేషంగా చెప్పవచ్చు. పలుమార్లు విశాలాంధ్రలో ప్లాంట్‌కు సంబంధించి కథనాలు రావడంతో పంచాయతీ, రెవెన్యూ అధికారులు మొక్కుబడిగా విచారణ చేసి వదిలేసారు. తాజాగా ప్లాంట్ యాజమాన్యం తమ కంపెనీకి పంచాయతీ టాక్స్ వేస్తే కట్టేస్తామని చెప్పడంతో పంచాయతీ అధికారులు అయోమయంలో పడ్డారు. వాటర్ ప్లాంట్‌కు పంచాయతీ నుంచి ఎటువంటి ఎన్‌వోసిలను ఇవ్వలేదు. అసలు పంచాయతీకి దరఖాస్తులే చేసుకోలేదు. ఈ నేపథ్యంలో టాక్స్ వేస్తే భవిష్యత్‌లో ఇబ్బంది పడతామనే ఆలోచనతో టాక్స్ వేసేందుకు పంచాయితీ అధికారులు ముందుకురావడం లేదని తెలుస్తోంది. అధికారుల ఆలసత్వంతో కంపెనీ యాజమాన్యం తన పని తాము చేసుకుపోతున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన పన్నులు మాత్రం రాకుండా పోయాయి. ఈ విషయమై అధికారులు కూడా కంపెనీ వారిని ఎన్‌వోసికి దరఖాస్తు చేసుకోమన్నా మని, అనంతరం టాక్స్ వేస్తామని చెప్పామని అంటున్నారు.

విజిలెన్స్ అధికారుల దాడుల నుంచి రక్షించండి

ఎమ్మెల్యేకు వ్యాపారుల వినతి

విశాలాంధ్ర - చీపురుపల్లి: ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందుల అమ్మకాలు చేసుకుంటున్న తమపైన విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులను జరిపి కేసులు నమోదు చేసి భయాందోళనకు గురి చేస్తున్నారని చీపురుపల్లి పట్టణానికి చెందిన వ్యాపారస్తులు ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావుకు శనివారం ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ అధికారులు దాడుల నుంచి తమను రక్షించాలంటూ మొరపెట్టుకున్నారు. తమ వ్యాపారంలో చిన్న చిన్న తప్పులు ఉన్నప్పటికీ 6-ఎ కేసులు నమోదు చేయడంతో ఆందోళన గురి కావాల్సి వస్తుందన్నారు. ఎరువులు యూరియా 245 ఈఎక్స్ విజయనగరం నుండి సరఫరా అవుతుందని దానిలో కిరాయి లోడింగ్ కొరకు అదనంగా 35 రూపాయలు ఖర్చు తమకి అవుతుందంటూ వర్తకులు వివరించారు. యూరియా ఎంఆర్పి ధర 266 రూపాయలు ఉన్నప్పటికీ తమకు ఫ్లోలో రావడంలేదని దీని కారణంగా ఎరువులు అమ్మకాల కోసం ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తమ సమస్యల పట్ల దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

19, 20 తేదీల్లో జనం కోసం జనసేవాధళ్

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఈ నెల 19, 20వ తేదీలలో జరుగు జనసేవాధళ్ శిక్షణా శిబిరాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ కోరారు. శనివారం స్థానిక అమర్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల శ్రేయస్సు కోసం జనసేవాధళ్‌ను సుదీర్ఘ కాలంగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన అమరజీవి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు స్థాపించడం జరిగిందన్నారు. అప్పటి దేశ ప్రజల సేవలో ప్రకృతి వైపరీత్యాలు తుఫాన్, భూకంపాలు సంభవించినపుడు జనసేవాధళ్ ముందుండి సేవలు అందిస్తుందన్నారు. సీపీఐ జాతీయ, రాష్ట్ర, జిల్లా, శాఖ మహాసభల సందర్భంగా ప్రత్యేక ఆకర్షణగా జనసేవాధళ్ కార్యకర్తలు నిలుస్తారని తెలియచేశారు. దానికోసం ఈ నెల 19,20 వ తేదీలలో జరుగు జనసేవాధళ్ శిక్షణా శిబిరాన్ని విజయనగరంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం, ఉపాధ్యక్షులు ఎ.సుమన్, సహాయ కార్యదర్శి వి.శ్రావణ్ కుమార్, విజయ్, హరి, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

మాధవ్‌కు పలువురి అభినందన

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన పి.వి.ఎన్.మాధవ్‌ను విజయనగరం జిల్లాకు చెందిన పలువురు నాయకులు అభినందించారు. విశాఖలో జరిగిన కార్యక్రమంలో విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు భవిరెడ్డి శివప్రసాద్ రెడ్డి, విజయనగరం పట్టణ అధ్యక్షుడు ఇప్పిలి గోపాలకృష్ణ, కంది సీతారాం, బూర జగ్గారావు పి.వి.ఎన్.మాధవ్‌ను అభినందిస్తూ జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి, టీడిపి నాయకులు పాల్గొన్నారు.

కూటమితోనే సుపరిపాలన సాధ్యం

విశాలాంధ్ర - మెంటాడ: కూటమి ప్రభుత్వం ద్వారానే సుపరిపాలన సాధ్యమని టీడిపి మండల అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు అన్నారు. శనివారం బుచ్చిరాజుపేట, పోరాం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి ఈ సంవత్సర కాలంలో ఇచ్చిన హామీలతో పాటు గ్రామ అభివృద్ధిలో ఎంతో కీలక పాత్ర వహించిదన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్,

మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు గెద్ద అన్నవరం, మెంటాడ పీఏసీఎస్ అధ్యక్షులు గొర్లె ముసలి నాయుడు, జక్కువ పిఎసిఎస్ అధ్యక్షులు ఆర్నపిల్లి సత్యం, తాడ్డి తిరుపతి, సిరిపురం గురు నాయుడు, ఎంపీటీసీ రెడ్డి ఎర్నాయుడు, జక్కువ పిఎసిఎస్ డైరెక్టర్ కుంచు వెంకట్ రెడ్డి, గోవింద్, కొల్లు అప్పారావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తి పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - వంగర: ప్రతి ఒక్కరూ దేశభక్తి పెంపొందించుకోవాలని ఆద్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఆర్.ఎస్.ఎస్ జిల్లా సేవాప్రముఖ్ గొట్టపు శ్రీనువాసరావు అన్నారు. శనివారం వంగర వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాల ఆవరణలో ఆయన మాట్లాడారు. భగవద్వజాన్ని గురువుగా భావించి ఆధ్యాత్మిక విషయాలు తెలియజేస్తూ భారతదేశ గొప్పతనాన్ని తెలియజేశారు.

భారతీయుల్లో దేశభక్తి క్రమశిక్షణ, దైవభక్తి పెంపొందించడం ఆర్ఎస్ఎస్ ప్రధాన ధ్యేయమని అన్నారు. వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బెవర ఈశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో మండల ఆర్ఎస్ఎస్ సేవా ప్రముఖ్ ఇందు, మౌళి, సమరత ఫౌండేషన్ ప్రచారక్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పేదరికాన్ని రూపుమాపేందుకే పి-4

15 నుంచి గ్రామ, వార్డు సభలు
కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర - విజయనగరం: రాష్ట్రంలోని పేదరికాన్ని రూపుమాపడమే లక్ష్యంగా, స్వర్ణ ఆంధ్ర - 2047 విజన్‌ప్లాన్‌లో భాగంగా ప్రభుత్వం పి-4 విధానాన్ని రూపొందించిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేర్కొన్నారు. బంగారు కుటుంబాల తుది జాబితాను తయారు చేసేందుకు ఈ నెల 15 నుంచి గ్రామ వార్డు సభలను నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లాలో ఇప్పటికే 67,066 బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. స్వర్ణాంధ్ర జీరో ప్రావర్టీ - పి 4 (పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్ట్ నర్ షిప్) ద్వారా ఎంపిక చేసిన బంగారు కుటుంబాల జాబితాను మరోసారి పునః పరిశీలన చేసి, మార్పులు చేర్పులతో తుది జాబితాను తయారు చేయనున్నట్లు తెలిపారు. దీనికోసం సచివాలయ సిబ్బంది ద్వారా గ్రామాలు, వార్డుల్లో జులై 15 నుండి 25 లోపల గ్రామసభలను నిర్వహించి తుది జాబితాను తయారు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆగస్టు 15 నాటికి తుది జాబితాలో ఉన్న బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకునేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. బంగారు కుటుంబాలను ఆర్థికంగానే కాకుండా చదువు, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాల పరంగా అభివృద్ధి చేసేందుకు మార్గదర్శులు తోడ్పాటును అందిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని ప్రజలలోకి విస్తృతంగా తీసుకుని వెళ్లి రూట్స్, యాప్ ద్వారా వివరాలను సేకరించి దిగ్విజయం చేయవలసినదిగా కోరారు.

మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయ నిధి

ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర - లక్కవరపుకోట: పేద ప్రజలు మెరుగైన వైద్యం పొందడానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. సుమారు 15 మందికి గాను రూ.11,09,363/-లక్షల రూపాయల చెక్కులను వివిధ రకాల అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వారికి అందజేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ వర్తించని అనేకమంది పేదలకు సీఎం సహాయ నిధి ద్వారా సహాయాన్ని అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కేబీవి రాంప్రసాద్, ఏఎంసీ చైర్మన్ మల్లు నాయుడు, మాజీ జడ్పిటిసి సభ్యులు కరేడ్ల ఈశ్వరరావు, వాళ్ల శ్రీను, కూటమి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

క్లౌడ్ సెంటర్‌గా సెంచూరియన్

ప్రపంచ ప్రఖ్యాత సంస్థలతో భాగస్వామ్యం
- సెంచూరియన్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని క్లౌడ్ సెంటర్‌గా తీర్చిదిద్దామని ఆ సంస్థ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డి.ఎన్.రావు అన్నారు. శనివారం విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి అన్ని విభాగాల్లో కృత్రిమ మేథ(ఏఐ) చేరుస్తామని చెప్పారు. ప్రస్తుతం సెంచూరియన్ ఒక క్లౌడ్ సెంటర్‌గా రూపొందిం దన్నారు. దేశంలో అగ్రగామిగా ఉన్న 50 సంస్థలతో తాము ఎంఓయూ కుదుర్చుకున్నా మన్నారు. ఇక్కడ విద్యార్థులకు డొమైన్ బేస్ ప్లేస్మెంట్స్ అందించడం తమ ప్రత్యేకత అన్నారు. ఇతర విశ్వవిద్యాలయాలకు భిన్నంగా సెంచూరియన్ విశ్వవిద్యాలయం తయారు చేస్తున్నామన్నారు. ఇక్కడ రెండు సూపర్ పవర్ కంప్యూటర్లు ఉన్నాయన్నారు. అలాగే ఒల్డ్ యాప్స్ తయారు చేస్తున్నామని, దేశంలోనే 28 నానో చిప్స్ తయారు చేస్తున్న మొదటి విశ్వవిద్యాలయమని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నైపుణ్యంతో కూడిన యువత అవసరమన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని యువతకు అవసరమైన నైపుణ్యా లను నేర్పిస్తున్నామ న్నారు. ఈ సందర్భంగా ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ సెంచూరి యన్‌ను ఒక స్కిల్ యూనివర్సిటీగా

అభివృద్ధి చేశామ న్నారు. ప్రతి ఏటా కొత్త కోర్సులు ప్రారంభించడంతో పాటు 32 డొమైన్స్ అందుబాటులోకి తీసుకొచ్చా మన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, అడ్మిషన్స్ ఇన్చార్జి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చిన గుడిపాలలో పశుగ్రాస వారోత్సవాలు

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని చినగుడిపాల గ్రామంలో పశుగ్రాస వారోత్సవాలు శనివారం నిర్వహించినట్టు మండల పశు వైద్యాధికారిణి కే.గాయత్రి తెలిపారు. పాడి రైతులకు పశుగ్రాసం పెంపకం వలన కలిగే లాభాలు, పశుగ్రాస ప్రాముఖ్యతపై వివరించారు. ఉచిత పశు గర్భకోశ ఆరోగ్య శిబిరం నిర్వహించి 22 మంది పాడి రైతులకు చెందిన 27పశువులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోజంకి రామానాయుడు, వేపాడ పశువైద్య సిబ్బంది, పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

రేపు వైసీపీ విస్తృత సమావేశం



విశాలాంధ్ర - గుర్ల: గరివిడిలో సోమవారం ఉదయం 10 గంటలకు వి గ్రాండ్ ఫంక్షన్ హాల్లో వైసీపీ నియోజకవర్గం విస్తృత సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు వైసీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజలకు వివరించవలసి ఉందన్నారు. శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షులు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లు హాజరవుతారని తెలిపారు.

గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - గుర్ల: ఎస్ఐ పి.నారాయణరావు నేతృత్వంలో పోలీసులు తారకరామ ప్రాజెక్ట్ కాల్వ గట్టు, మణిపురిపేట గ్రామం వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ముగ్గురు వ్యక్తులు పట్టుబడగా, వారి వద్ద నుండి కేజీ గంజాయి, ఒక రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బైకు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వారిపై ఎన్‌డిపిఎస్ చట్టంలోని సెక్షన్ 20(ఎ)(ii)(B) ప్రకారం కేసు నమోదు చేసినట్టు సీఐ శంకరరావు తెలిపారు.

గుండాలపేటలో సుపరిపాలనలో తొలిఅడుగు

విశాలాంధ్ర - డెంకాడ: గుండాలపేట గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని టీడీపీ తెలుగు యువత ఉపాధ్యక్షులు బుగత రమణ అధ్యక్షతన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గురించి వివరిం చారు. ఈ కార్యక్రమంలో కాళ్ల భూలోక అప్పుడు, రామిన ఆదప్పుడు, పైడిరాజు, నామాల శంకర్, బుగత సూరి బాడిత మాను అప్పారావు, నామాల శ్రీను, పల్లా శీను, బుగత వంశీ పాల్గొన్నారు.

శివ్వాం పీఏసీఎస్ అధ్యక్షునిగా బెజ్జిపురపు రవి నియామకం

విశాలాంధ్ర - వంగర: మండలంలో ఉన్నటువంటి శివ్వాం ఏకైక కోపరేట్ బ్యాంక్ అధ్యక్షునిగా నీలయ్యవలస గ్రామ టీడీపీ నాయకుడు బెజ్జి పురపు రవిని నియమించారు. ఈ మేరకు సంబంధిత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మండలం నీలయ్య వలస గ్రామానికి చెందిన ఈయన గత కొంత కాలంగా టీడీపీ నాయకునిగా, మండల తెలుగు యువత అధ్యక్షునిగా పని చేశారు. రాజకీయాలు ప్రారంభం నుండి బెజ్జిపురపు రవి తెలుగు దేశం పార్టీలోనే ఉన్నారు. చైర్మెన్‌గా నియమితులైన రవిని శాసనసభ్యులు కోండ్రు మురళీమోహన్ ఆయన సోదరుడు జగదీశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు పిన్నింటి మోహన్‌రావు తదితర అనుచరులు దుశ్శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, రాజాం నియోజక వర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు మజ్జి గణపతి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి

డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: విజయనగరం సబ్ డివిజన్ పరిధిలో ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, రోడ్ షోలు నిర్వహించాలంటే సంబంధిత వ్యక్తులు ముందస్తుగా పోలీసుశాఖ అనుమతి పొందాలని విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సెక్షన్ 30 పోలీసు చట్టం-1861, నెల రోజులపాటు అమలులో ఉంటుందన్నారు. ఈ చట్టం ప్రకారం విజయనగరం సబ్ డివిజన్ పరిధిలో పోలీస్ చట్టం-1861లోని సెక్షన్ 30 ప్రకారం ఊరేగింపులు, బహిరంగ సభలు, ర్యాలీలు, ధర్నాలు మొదలైన వాటి నిర్వహణకు ముందస్తు అనుమతులు తప్పనిసరన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల ప్రశాంతత దృష్ట్యా, వివిధ రాజకీయ పార్టీలు/సమూహాలు/సంస్థలు ఊరేగింపులు, సమావేశాలు, ధర్నాలు, బంద్ పిలుపులు, రోడ్లపై , రోడ్డు పక్కన గుమిగూడటం, రోడ్ షోలు నిర్వహించే అవకాశం ఉంది. ఒకేసారి, ఒకే చోట రోడ్ షోలు మరియు ఊరేగింపులు నిర్వహించినప్పుడు శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడానికి వివిధ పార్టీలు/సమూహాలు నిర్వహించే ఇటువంటి బహిరంగ సభలు లేదా ఊరేగింపులను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని,శాంతిభద్రతలు, ప్రజల ప్రశాంతత దృష్ట్యా, ఊరేగింపులు, బహిరంగ సభలు, ర్యాలీలు, ధర్నాలు మొదలైన వాటికి విజయనగరం సబ్-డివిజనల్ పోలీస్ అధికారి నుండి ముందస్తు అనుమతి లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. కావున, ప్రజలు గమనించాలని, తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలని కోరారు.

అగ్రిఫీల్డ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - పూసపాటిరేగ: మండలంలోని రెల్లివలస గ్రామంలో ప్రముఖ అధునాతన వ్యవసాయ పరికరాల సంస్థ అగ్రిఫీల్డ్ ప్రత్యేకంగా ప్రజలకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించింది. కమ్యూనిటీ శ్రేయస్సు బలోపేతం చేసేందుకు గ్రామీణ, ఆరోగ్య సంరక్షణ, విద్యలలో ప్రభావంతమైన సిఎస్ఆర్ కార్యకలాపాలను సంస్థ నిర్వహిస్తోంది. అందులో భాగంగా రెల్లివలసలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి 200మందికి పైగా ప్రజలు హాజరై తమ రోగనిర్ధారణ పరీక్షలను చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులను అందజేయడం జరిగింది. ఈసందర్భంగా సంస్థ సిఇవో, అగ్రిఫీల్డ్ సహ వ్యవస్థాపకులు అమిత్ గుప్తా మాట్లాడుతూ రోగ నిర్ధారణ చేసిన వెంటనే చికిత్సను ప్రారంబించడం ఎంతోసంతోషంగా భావిస్తున్నామని అన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడాపోటీలను నిర్వహించారు. 250మంది విద్యార్థులు ఈక్రీడా పోటీలలో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేసారు. అగ్రిఫీల్డ్ సేవలు అందని ప్రాంతాలలో సిఎస్ఆర్ ఔట్‌రీచ్ ద్వారా సేవలను అందిస్తామన్నారు.

గంజాయి నిర్మూలనే ధ్యేయం

బొబ్బిలి డి.ఎస్.పి భవ్య రెడ్డి

విశాలాంధ్ర - రామభద్రపురం: ఒడిస్సా రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గంజాయి రాకుండా అడ్డుకట్ట వేయడమే పోలీసులు ప్రథమ కర్తవ్యం అని బొబ్బిలి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అధికారి భవ్య రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి గ్రీన్ ఫీల్డ్ 6 లైన్ హైవే రావి వలస జంక్షన్ వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న చెక్ పోస్ట్ సిబ్బందికి కొన్ని సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా గంజాయి రాకుండా చూడాలని ఇటువైపు వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. అనుమాన స్పదంగా ఏ వాహనం వచ్చిన విడిచి పెట్టవద్దని అన్నారు. అలాగే వాహనాలలో నిషేధిత వస్తువులు తరలిస్తే పట్టుకొని కేసులు నమోదు చేయాలని అన్నారు. 24 గంటలు పదిమంది సిబ్బందితో తనిఖీలు చేపడుతున్నామని అన్నారు. ఈమె వెంట బొబ్బిలి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కే నారాయణరావు, ఎస్సై వెలమల ప్రసాదు ఉన్నారు.

అలరించిన యామిని కృష్ణ గానం

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ విజయనగరం 719వ కార్యక్రమం శ్రీనాదవర్ధని సంగీతాలయం సంయుక్తంగా శనివారం సాయంత్రం ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో నిర్వహించారు "వందే గురుపరంపరాం" శీర్షికగా శ్రీకాకుళంకి చెందిన కరి యామినికృష్ణ గాత్ర కచేరితో సభరంజింపజేసారు. వసంత రాగంలో నిన్ను కోరి తాస వర్ణంతో కచేరి ప్రారంభించి, హంసవినోదినిలో బాలమురళి రచన గురువుని స్మరింపుము, కాంభోజి రాగంలో మైసూర్ వాసుదేవాచార్య కృతి లంబోదర మావలంబే, ప్రధానాంశంగా కల్యాణి రాగంలో త్యాగరాజ కృతి ఏ తావునరా స్వరకల్పనలు చేసారు. జావళి, తిల్లాన, అభంగ్ మీరాభజన్‌తో సభ ముగించారు. సరస్వతుల పార్థీవ వయొలిన్, ప్రముఖ మృదంగ విద్వాంసులు సంస్థ కార్యదర్శి, డాక్టర్ మండపాక రవి మృదంగంపై సహకారాన్ని అందించి కచేరి రక్తి కట్టించారు. అసోసియేషన్ అధ్యక్షులు ధవళ సర్వేశ్వరరావు, సభ్యులు మోడేకుర్తి శ్రీనివాసరావు, డాక్టర్ కె.ఎ.పద్మప్రియ, వి.అప్పలస్వామి, భోగరాజు సూర్యలక్ష్మి, శారద తదితరులు హాజరయ్యారు.

ఉత్సాహంగా మొదలైన ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా ప్లీనరీ సమావేశాలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పట్టణంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు మొదలయ్యాయి. మొదటగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి రాము ఎస్ఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి రామ్మోహన్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చి అన్ని రాష్ట్రాల మీద అమలు చేయాలని రుద్దుతుందని. గత రాష్ట్ర ప్రభుత్వం హయాంలో అత్యుత్సాహంగా నూతన విద్యా విధానాన్ని అమలు చేశారన్నారు. దీనివలన అనేక మంది విద్యార్థులు విద్యకు దూరమై వేల కోలది పాఠశాలలు మూతపడ్డాయన్నారు. అదేవిధంగా ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నూతన విద్యా విదానాన్ని రద్దు చేస్తామని చెప్పి ప్రస్తుతం అదే విద్యా విధానాన్ని శరవేగంగా అమలు చేస్తున్నారన్నారు. కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు నూతన విద్యా విధానాన్ని అమలు చేయబోము అని అసెంబ్లీ ద్వారా తీర్మానం చేసుకోవడం జరిగిందన్నారు. మన రాష్ట్రంలో నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా ఉన్నారని గతంలో పాదయాత్రలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని అదే విధంగా హాస్టల్ భవనాలను నూతనంగా నిర్మిస్తామని చెప్పి ఈరోజు ఆహామీని గాలికి వదిలేసారన్నారు. అంతేకాకుండా జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడు అమ్మఒడి ఏదైతే ఉందో కూటమి ప్రభుత్వం రాగానే షరతులు లేకుండా అమ్మ వడిని ప్రతి విద్యార్థికి అందిస్తామని చెప్పి ఈరోజు మాట తప్పి విద్యార్థుల్ని మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షు, కార్యదర్శులు డి. రాము, సిహెచ్. వెంకటేష్‌లు మరియు అధ్యక్ష వర్గంగా శిరీష, రాజు, రమేష్, జిల్లా ఆఫీసు బేరర్స్, జిల్లా కమిటీ సభ్యులు, ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు

డ్రోన్ సహాయంతో ఓపెన్ డ్రింకింగు రైడ్స్ నిర్వహణ : జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జామి పోలీసు స్టేషను పరిధిలోని భీమసింగి, పెద మానపురం పోలీసు స్టేషన్ లోని మానాపురం సంత శివారు ప్రాంతాల్లో జూలై 11న ఓపెన్ డ్రింకింగు చేస్తున్న వారిపై పోలీసులు డ్రోన్స్ సహాయంతో రైడ్స్ నిర్వహించి, ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్న 7గురిని అదుపులోకి తీసుకొని, వారిపై కేసులు నమోదు చేసారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపైఆకస్మికంగా దాడులు నిర్వహించేందుకు గత కొన్ని మాసాలుగా డ్రోన్స్ ను వినియోగిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా జూలై 11న సాయంత్రం జామి మండలం భీమసింగి శివార్లలోని లే-అవుట్ లోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై డ్రోన్స్తో నిఘా ఏర్పాటు చేసామన్నారు. డ్రోన్స్ ప్రయోగించి, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారిపై ఓపెన్ డ్రింకింగు కేసులను నమోదు చేసామని తెలిపారు. అదే విధంగా మానాపురం సంత వద్ద డ్రోన్స్ సహాయంతో ఓపెన్ డ్రింకింగ్ కు పాల్పడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని, వారిపై మూడు కేసులను నమోదు చేశామని తెలిపారు. నేర నియంత్రణలోను, శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు డ్రోన్స్ ను వినియోగించాలని, శివారు ప్రాంతాలపై నిఘా పెట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు.

శాంతి భద్రతల దృష్ట్యా నెలరోజులు ఆంక్షలు : డీఎస్పీ రాఘవులు

విశాలాంధ్ర-చీపురుపల్లి : జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 11 నుండి వచ్చే నెల 10వ తేదీ రాత్రి పది గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని డీఎస్పీ వివరించారు. చట్టం-1861లోని సెక్షన్ 30 ప్రకారం, 11.07.2025 రాత్రి 10.00 గంటల నుండి 10.08.2025 రాత్రి 10.00 గంటల వరకు ఒక నెల రోజుల పాటు చీపురుపల్లి సబ్-డివిజన్‌లో ఊరేగింపులు లేదా బహిరంగ సభలు, ర్యాలీలు, ధర్నాలు మొదలైనవాటిని పరిమితం చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నాను అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల ప్రశాంతత దృష్ట్యా, వివిధ రాజకీయ పార్టీలు, సమూహాలు, సంస్థలు ఊరేగింపులు, సమావేశాలు, ధర్నాలు, బంద్ పిలుపులు, రోడ్లపై, రోడ్డు పక్కన గుమిగూడటం, రోడ్ షోలు నిర్వహించే అవకాశం ఉన్నందున ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. ఒకేసారి, ఒకే చోట రోడ్ షోలు, ఊరేగింపులు నిర్వహించినప్పుడు శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉంది అన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడానికి వివిధ పార్టీలు, సమూహాలు నిర్వహించే ఇటువంటి బహిరంగ సభలు లేదా ఊరేగింపులను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది అన్నారు. శాంతిభద్రతలు ప్రజల ప్రశాంతత దృష్ట్యా, ఊరేగింపులు, బహిరంగ సభలు, ర్యాలీలు మరియు ధర్నాలు మొదలైనవాటికి చీపురుపల్లి సబ్-డివిజనల్ పోలీస్ అధికారి నుండి ముందస్తు అనుమతి లేకుండా నిషేధించబడ్డాయి అని ఆయన వివరించారు. ఈ ఉత్తర్వులు పోలీస్ చట్టం 1861లోని ప్రొసీడింగ్స్-30 మరియు 31 అమలులో భాగంగా జారీ చేయబడ్డాయి అన్నారు. ఈ ఉత్తర్వు తక్షణమే అమలులోకి వస్తుంది కావున ఈ ఉత్తర్వును ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి అని హెచ్చరించారు. ఈ ఉత్తర్వును ఉల్లంఘించిన వారు పోలీస్ చట్టం 1861లోని సెక్షన్లు 30 మరియు 31 మరియు వర్తించే ఇతర చట్టాల ప్రకారం ప్రాసిక్యూషన్‌కు బాధ్యులవుతారు పని డి.ఎస్.పి స్పష్టం చేశారు.

బాబు షూరిటీ... భవిష్యత్తు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-వేపాడ : నాడు ఎన్నికల ముందు బాబు షూటి భవిష్యత్ గ్యారెంటీ అంటూ ప్రజల్లోకి వెళ్లి ఎన్నికల్లో గెలిచిన తర్వాత బాబు చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శృంగవరపుకోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన వేపాడ సచివాలయం ఆవరణలో శనివారం మండల పార్టీ అధ్యక్షుడు ముమ్ములూరి జగ్గుబాబు అధ్యక్షతన వైసీపీ మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలను అభివృద్ధి బాటలో నడిపిస్తానన్న చంద్రబాబు ప్రజలను మోసం చేయడమే కాకుండా సంక్షేమ పథకాలను తుంగలో తొక్కుతున్నారన్నారు. కావున బాబు మోసాలను ప్రతి గడపకి తీసుకెళ్లే వారి నష్టపోతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని నాయకులకు కార్యకర్తలకు సూచించారు. అలాగే ప్రతి గ్రామంలో ఉత్సాహవంతులైన యువతీ యువకులను 9మంది సభ్యులను ఒక కమిటీ ఏర్పాటు చేయాలని అలాగే ఆ గ్రామంలో ఈ కార్యక్రమం చేపట్టేటప్పుడు ప్రజలను చైతన్యపరిచే బాధ్యత ఆ కమిటీపై ఉందన్నారు. ఈనెల 17న వేపాడ,18న వల్లంపూడిలో బాబు షూరిటీ భవిష్యత్తు మోసాలపై కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే రానున్న సంస్థ గత ఎన్నికల్లో ప్రతి గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నేత మాజీ డిసిసిబి ఛైర్మన్ వేచలపు వెంకటచినరామనాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జడ్పీటీసీ శానాపతి అప్పారావు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వర రావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, ఎంపీటీసీలు ఆకుల సత్యనారాయణ, తొండవరపు వెంకటరమణ, రాయవరపు రాజీవ్, గాడి గంగతల్లి,మాజీ ఏఎంసీ ఛైర్మన్ మూకల కస్తూరి, మాజీ వైస్ ఎంపీపీ దుల్ల మహేష్,అయా గ్రామాల సర్పంచులు మురిపిండి గంగరాజు, గొంప వేమన రాము,పార్టీ నాయకులు కండిపల్లి పెదనాయుడు, నిరుజోగి శ్రీనివాస్, ఆదపరెడ్డి ముత్యాల నాయుడు మెలిపాక రమణ, వంటాకు శ్రీను, బల్లంకి కనకరాజు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హోమియోపతి మందులతో మెరుగని వైద్యం అందించాలి

ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి

విశాలాంధ్ర-వేపాడ : హోమియోపతి మందులతో మెరుగని వైద్యం అందించాలని వైద్యాధికారిణి ఎం.శిరీషకు శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి సూచించారు. మండలంలోని బలంకి గ్రామంలో గల హోమియోపతి వైద్య కేంద్రంను ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోమియోపతి వైద్యంతో అనే రోగాలు నయమవుతాయని ఈమందులతో దీర్ఘకాలిక వ్యాధులకు చెక్ పెట్టవచ్చని సూచించారు. గత వైసిపి ప్రభుత్వంలో హోమియోపతి వైద్యం నిర్లక్ష్యం చేయడమే కాకుండా ఈ హోమియోపతి వైద్యుని నియమించకపోవడంతో మందులు ఆరకూరగానే అందించేవారిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైద్యాధికారిణిని నియమించడం ఆనందదాయకమన్నారు. కావున హోమియోపతి వైద్యులు ప్రతి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి మందులు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి లక్ష్మి, గ్రామ మాజీ సర్పంచ్ గొర్లి నాగరాజు ఉపసర్పంచ్ పల్లి ధనుంజయ్, టిడిపి నాయకులు గుంటపల్లి దేముడు నాయుడు, రంది మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్య నైపుణ్యాలతో దేశాభివృద్ధి

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఉన్నత విద్య ,నైపుణ్యాలు దేశాభివృద్ధికి తోడ్పడతాయని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు అన్నారు. విద్యతోపాటు ఉద్యోగ, ఉపాధి మార్గాలనూ నేర్పుతున్న సెంచూరియన్ విశ్వ విద్యాలయం భవిష్యత్‌లో ఎంతో మందికి ఉన్నతమైన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని ఆయన ఆకాంక్షించారు. విశ్వ విద్యాలయ ఛాన్సలర్ డాక్టర్ జి.ఎస్.ఎన్.రాజు ఆహ్వానం మేరకు శనివారం విశ్వ విద్యాలయాన్ని డాక్టర్ డివిజి శంకరరావు సందర్శించారు. ఈసందర్భంగా వివిధ విభాగాలను పరిశీలించడంతోపాటు అక్కడి విశేషాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రంగంతోపాటు మెకానికల్, వైద్య తదితర విభాగాలలో విశ్వ విద్యాలయం అందిస్తున్న విద్యావకాశాలను ఛాన్సలర్ డాక్టర్ జి ఎస్ ఎన్ రాజు వివరించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమంలో భాగంగా మహిళలు కుట్టుపని నేర్చుకుని ఆదాయ మార్గాలను పెంచుకోవడాన్ని డాక్టర్ డివిజి శంకరరావు ఈసందర్భంగా అభినందించారు. విశ్వ విద్యాలయ గ్రంథాలయాన్ని పరిశీలించారు.

ప్రజలకు నిరంతరం తాగునీటిని అందించేలా పర్యవేక్షణ

నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం

విశాలాంధ్ర-విజయనగరం : సురక్షితమైన తాగునీటిని ప్రజలకు ఇబ్బందులు లేకుండా అందించేందుకు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఈమేరకు ఆయన ఆదేశాలతో నగరంలో పలు ప్రాంతాలలో ఏర్పడ్డ పైపులైను లీకేజీ పనులను సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. వీటి అగ్రహారం, కొత్తపేట, బీసీ కాలనీలో రెండు చోట్ల పైపులైను లీకేజీలను గుర్తించారు. వీటికి తక్షణమే మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో యథావిధిగా ఆయా ప్రాంతాల్లో నీటి సరఫరా జరుగుతుంది. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ పైప్లైన్ లీకేజీలను గుర్తించిన వెంటనే వాటి పనులను చేపట్టామన్నారు. ఎక్కడ నీరు కలుషితం కాకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలను తీసుకుంటున్నామన్నారు. రంగు మారిన నీరు పంపిణీ అవుతుందని వచ్చిన ఫిర్యాదు మేరకు తక్షణమే సిబ్బందిని అప్రమత్తం చేసి పరిస్థితిని పరిశీలించాలని ఆదేశించామన్నారు. ప్రతిరోజు సచివాలయాల వారిగా నీటి నమూనా పరీక్షలను జరిపిస్తున్నామన్నారు. సురక్షితమైన తాగునీటిని అందించేందుకు నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నామన్నారు. ఎక్కడైనా రంగు మారిన నీటిని గమనించినట్లయితే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. ప్రజలు కూడా తాగునీటిని వృథా చేయకుండా టాప్ హెడ్స్ ను బిగించుకోవాలని తెలిపారు.

గంజాయి అక్రమ రవాణా నియంత్రణే లక్ష్యంగా ఆకస్మిక తనిఖీలు

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : రైళ్ళలో గంజాయి అక్రమ రవాణ నియంత్రణే లక్ష్యంగా ఫలక్నుమా ఎక్స్‌ప్రెస్లో లోకల్ పోలీసు, జి.ఆర్.పి., ఈగల్, ఆర్.పి.ఎఫ్ పోలీసులు మరియు డాగ్ స్క్వాడ్తో సంయుక్తంగా బృందాలను ఏర్పాటు చేసి, ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ - రాష్ట్ర డిజిపి ఆదేశాలతో గంజాయి అక్రమ రవాణను నియంత్రించేందుకు ఈగల్, లోకల్ పోలీసు, గవర్నమెంట్ రైల్వే పోలీసు, డాగ్ స్క్వాడ్ మరియు రైల్వే ప్రొటక్షన్ పోలీసులతో ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి, ఫలక్ నుమా ట్రెయిన్లో ఆకస్మిక తనిఖీలునిర్వహించామన్నారు. గంజాయి ప్రధానంగా ఒడిస్సా రాష్ట్రం నుండి ట్రెయిన్స్ ద్వారా ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణ అవుతుందన్న సమాచారంతో ప్రత్యేకంగా ట్రెయిన్ను లక్ష్యంగా చేసుకొని తనిఖీలు చేపట్టామన్నారు. ఈ బృందం విజయనగరం రైల్వే స్టేషనులో ఫలక్నుమా ఎక్స్‌ప్రెస్లో విశాఖపట్నం వరకు ప్రయాణించి, బృందాలుగా ఏర్పడి అన్ని భోగీల్లోను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో పాల్గొన్న పోలీసు సిబ్బందికి, అధికారులకు ప్రయాణికులతో వ్యవహరించాల్సిన తీరు గురించి విజయనగరం వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ ముందుగా వివరించి, వారు నిర్వర్తించే విధులు గురించి దిశా నిర్దేశం చేసారు. ఫలక్నుమా ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్ లోని అన్ని భోగీల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, బ్యాగులను, లగేజ్, సూట్కేసులను నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సహాయంతో క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. తనిఖీలో ఎటువంటి గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలు లభించలేదన్నారు. రాష్ట్రంలో గంజాయిని నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రత్యేకంగా ఈగల్ టీమ్స్ ను నియమించిందన్నారు. ఈగల్ టీమ్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజున వివిధ ట్రెయిన్స్లో తనిఖీలు చేపట్టామన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్ధాల అక్రమ రవాణ, విక్రయాలు, వినియోగం గురించి సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబరు 1972కు అందించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ప్రజలను కోరారు. ఈ తనిఖీల్లో తెర్లాం ఎస్ఐ సాగర్ బాబు, జిఆర్పి ఎస్ఐ మధుసూధనరావు, ఆర్.పి.ఎఫ్. ఎస్ఐ శ్రీధర్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది మరియు 40మంది పోలీసు అధికారులు మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-డెంకాడ: డెంకాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీ గా ఉన్న మాథ్స్ లెక్చరర్ పోస్టుకు గెస్ట్ లెక్చరర్ గా పని చేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పి.హిమగాయత్రి ఒక ప్రకటనలో కోరారు. సంబంధిత సబ్జెక్టు లో పోస్టు గ్రాడ్యుయేషన్ 50% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, ఈ నెల 15 లోగా దరఖాస్తులను తమకు అందజేయాలని తెలిపారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు 17వ తేదీ ఉదయం 11 గంటలకు విజయనగరం టౌన్ కాలేజ్‌లో ఇంటర్వ్యూలు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

సచివాలయాల పరిధిలో ఫీవర్ సర్వే మరియు రోగ నిరోధక టీకాలు

విశాలాంధ్ర-విజయనగరం : నగరవ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో ఫీవర్ సర్వే మరియు రోగ నిరోధక టీకాల వేసే కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో హెల్త్ కార్యదర్శులు, ఏఎన్ఎంలు సంయుక్తంగా ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేపడుతున్నారు. అలాగే అంటు రోగాలు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరిస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలడానికి దోమలే ముఖ్య కారణం అన్న విషయాన్ని ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకువస్తున్నారు. దోమల నిరోధానికి చేపట్టాల్సిన చర్యలను వివరిస్తున్నారు. అలాగే బాలింతలు, గర్భిణీలకు రోగనిరోధక టీకాలను అందిస్తున్నారు. అతిసారం వంటి ఇతర వ్యాధులను ఎదుర్కొనేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఎంతో ఉపయోగంగా ఉంటాయని వివరిస్తూ, వాటిని ఉచితంగా అందజేస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సరిపడా మందులు నిల్వ ఉన్నాయన్నారు. అంటూ వ్యాధులు ప్రబలకుండా దోమల నిరోధానికి జాగ్రత్తలు వహించాలన్నారు. అలాగే కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తీసుకోవాలని సూచించారు.

పట్టాభిరామ్ చిరస్మరణీయుడు

డాక్టర్ వి.ఎస్.ప్రసాద్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, ఇంద్రజాలికులు, మానసిన వైద్యులు, రచయిత పట్టాభిరామ్ చిరస్మరణీయుడని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు డాక్టర్ వి ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. విజయనగరం జిల్లా మెజీషయన్‌ల ఆధ్వర్యంలో గురజాడ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రచయిత, సాహితీవేత్త, సముద్రాల గురుప్రసాద్, ప్రముఖ సాహితీవేత్త, డాక్టర్ గోపాలరావు, విజయనగరం గిరిజన విశ్వవిద్యాలయం పరిపాలనాధికారి డాక్టర్ ఎన్.వి.ఎస్ సూర్యనారాయణలు మాట్లాడుతూ పట్టాభిరామ్ జీవితం స్ఫూర్తిదాయకమని, ఆదర్శ ప్రాయమని అన్నారు. కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలనం చేసిన సి డబ్ల్యు సి ఛైర్ పర్సన్ గోటేటి హిమబిందు, ప్రముఖ మెజీషియన్ శ్యామ్, ఎస్ బి టి మార్కెట్ పూర్వ అధ్యక్షులు పివి రామారావులు మాట్లాడుతూ పట్టాభిరామ్ ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కోట్లాదిమంది జీవితాల్లో వెలుగులు నింపారని, ఆయన బాటలో నేటి యువత నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొని గురజాడ పాఠశాల ప్రిన్సిపాల్ పూడి శేఖర్, ఇంద్రజాలికులు పవన్ ఆశీష్, క్రాంతికుమార్, సలీమ్, సైకాలజిస్టులు ఎస్ వి రమణ, శివ ప్రసాద్, రాజశేఖర్, రాంబాబు, ఎలిశెట్టి సురేష్, విశ్రాంత మండల విద్యాశాఖాధికారి రావు విజయ్‌కుమార్ లు పట్టాభిరామ్‌కు ఘనంగా నివాళులర్పించారు.